క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఉపయోగం



గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణానికి చెందిన పరశురాముడికి మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండు ద్వారా రూ.2.5లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నర్సింహులు, రఘు, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



గట్టు: వ్యవసాయ అవసరాలతో పాటు గృహ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు అయిజ ఏఈడీ గోవిందు తెలిపారు. శుక్రవారం గట్టును ఏడీఈ సందర్శించారు. కొద్ది రోజులుగా గ్రామంలో గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఏడీఈ స్వయంగా వచ్చి పరిశీలించారు. లైన్‌మెన్ భీమేష్, విద్యుత్ సిబ్బందితో గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఈ తెలిపారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో వర్షం కోసం రైతులు కృష్ణానది నుంచి నీరు తీసుకొచ్చి గ్రామ దేవతలకు, శివునికి, ఆంజనేయస్వామి విగ్రహానికి, బొడ్రాయికి, అభిషేకం చేశారు. శుక్రవారం ప్రాగటూరు గ్రామ ప్రజలు, రైతులు పంటలు ఎండుముఖం పట్టడంతో వర్షంకోసం ప్రత్యేక పూజలు నిర్వహించి 11 బిందెలతో అభిషేకం చేశారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'రాఖీ' వేడుక



గద్వాల న్యూటౌన్: బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం 'రాఖీ' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు 'రాఖీలు' కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రజక జయశ్రీ, భారతి పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



ధరూరు: వారం రోజులుగా ఎండలకు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. మధ్యాహ్నం 2గంటలకు అరగంట పాటు ధరూరు, మన్నాపురం గ్రామాల్లో భారీవర్షం కురిసింది. వారం రోజులు ఎండలవల్ల మెట్టపంటలు వాడుముఖం పట్టాయి. మరోవారం రోజులు ఎండలు ఉంటే ఆముదం, కంది, సజ్జ, జొన్న, పత్తి వంటి మెట్ట పంటల పరిస్థితి ప్రశ్నార్థకమయ్యేది. వర్షం కో సం రైతులు, కూలీలు ఎదురు చూస్తున్న క్ర మంలో వర్షం కురిసి పంటలకు జీవం పోసింది.

సైకిల్‌ను ఢీకొట్టిన బైక్: వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పుల్లూరు గ్రామానికి చెందిన నరసింహులు ఈ నెల 14న సైకిల్‌పై జాతీయ రహదారి నుంచి వెళ్తున్నాడు. మహవీర్ ఆలయం దాటాక పంచలింగాలకు చెందిన సలామ్ బైక్‌తో సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. నరసింహులు కుమారుడు రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు పనులకు మోక్షమెప్పుడో?



అలంపూర్-రాయచూర్ రోడ్డుకు ఇరువైపుల మూసుకుపోయిన ముళ్లపొదలు

- అలంపూర్-రాయచూర్ రహదారి ఇరువైపుల ముళ్ల పొదలు
- గుంతలతో తరచూ ప్రమాదాలు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- టెండర్ పూర్తయినా పనులు ప్రారంభించని వైనం

శాంతినగర్: మూడు రాష్ట్రాలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిమంది వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. నియోజకవర్గంలోని అలంపూర్ చౌరస్తా నుంచి బలిగేర వరకు రెండు లైన్ల ప్రధాన రహదారి ముళ్లపొదలతో మూసుకుపోవడం, గుంతలు పడ్డాయి. కల్వర్టుల వద్ద రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని చౌరస్తా నుంచి అయిజ వరకు 42 కి.మీ.ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి ముళ్లపొదలు..

42 కి.మీ. రహదారిలో ముళ్ల పొదలు పెరిగాయి. దీంతో వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. వంద అడుగుల రహదారి 80 అడుగుల మేర ముళ్లపొదలు, పిచ్చిగడ్డితో మూసుకుపోయింది.

కల్వర్టుల వద్ద ప్రమాదాలు..

చౌరస్తా నుంచి అయిజ రహదారిలో శాంతినగర్-వెంకటాపురం మధ్య పాత కల్వర్టులు ఇరుకుగా ఉంటూ ప్రమాదాలకు హేతువులుగా మారాయి. డబుల్ లైన్‌కు అనుగుణంగా కొత్తగా కల్వర్టులు నిర్మించలేదు. కల్వర్టులు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మృత్యువాత పడుతున్న ప్రయాణీకులు

శాంతినగర్ - వెంకటాపురం మధ్యలో పాత కల్వర్టులు శిథిలావస్థకు చేరి ఇరుకుగా ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గతంలో ముగ్గురు యువకులు, ఓ కర్ణాటక వాసి మృతి చెందారు.

టెండర్లు పూర్తయినా..

రోడ్డు పనులు చేపట్టడానికి టెండర్లు పూర్తయినా పనులు మొదలుపెట్టలేదు. ముళ్లపొదలు తొలగించడానికి, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టడానికి, వైట్ లైన్‌లు ఏర్పాటు చేయడానికి రూ.10 లక్షలు మంజూరై టెండర్ వేశారు. పనులు మొదలుపెట్టకపోవడంతో ప్రయాణికులు మృతి చెందుతున్నారు.

ప్రమాదాలు ఎక్కువగా..



ముళ్లపొదల వల్ల రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే భారీ వాహనాల వెలుతురుకు కల్వర్టులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మోటార్‌సైకిళ్లపై వస్తున్న సమయంలో కల్వర్టులు కనిపించక ఇటీవల ముగ్గురు చనిపోయారు. సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి.

– పాపన్న, అయిజ

ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలి



శాంతినగర్ – అయిజ డబుల్ రోడ్డులో గుంతలు పడ్డాయి. రోడ్డు పైకి కంపచెట్లు రావడం ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. రాయచూర్ రోడ్డుపై వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలి.

– గోరనాథ్, యాపదిన్నె, అయిజ

టెండర్లు పూర్తయ్యాయి..

రాయచూర్ ప్రధాన రహదారికి ఇరువైపుల ముళ్లపొదలు తొలగించడానికి, గుంతలవద్ద ప్యాచ్ వర్క్ చేయడానికి, కల్వర్టుల వద్ద ప్రమాదాల నివారణకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ వేశాం, అగ్రిమెంట్ అయిన వెంటనే పనులు చేపట్టి ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తాం.

– మహేష్, జేఈ, ఆర్అండ్‌బీ

ఎమ్మెల్సీకి జనసమితి నేతల శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శాంతినగర్: నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికై శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ జన సమితి రాష్ట్ర అధినేత ప్రొఫెసర్ కోదండరాంను శాంతినగర్‌కు చెందిన తెలంగాణ జనసమితి నాయకులు కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకుడు వై.రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి అలంపూర్ సమస్యలు ఆయనకు వివరించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని దేశ నాయకుల వరకు చేరవేసే విధంగా ఎన్నో ఉద్యమాలు చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ప్రొఫెసర్ ఎంతో కృషి చేశారని, ఆయనకు ప్రస్తుత ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కష్టాన్ని గుర్తించి ఎమ్మెల్సీ పదవి కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి



ఎర్రవల్లిచౌరస్తా: నూతనంగా ఏర్పడిన ఎర్రవల్లి మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల ప్రజలు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు ఎర్రవల్లి మండలంలో కేవలం తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, మిగిలిన కార్యాలయాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉమ్మడి ఇటిక్యాలకు వెళ్తున్నారని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం ఎర్రవల్లిలో ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వెటర్నరీ ఆస్పత్రితో పాటు మహిళా సమైఖ్య భవనం ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాగన్న, పెద్ద లక్ష్మన్న, రాముడు, ధర్మారెడ్డి, కృష్ణ, లాల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

అయిజ: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. బైక్‌లు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ బృందం జయన్న, కృష్ణ, రాజు, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో సీఎం సోదరుడి పూజలు



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ స్వాగతం పలికి ప్రత్యేక పూజ లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

వసతి భవనానికి నీటి కనెక్షన్ ఇవ్వొద్దు



అలంపూర్‌లో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న వార్డు ప్రజలు

అలంపూర్: మున్సిపాలిటీ వార్డుల నుంచి ప్రసాద్ స్కీం వసతి భవనానికి తాగునీటి కనెక్షన్ ఇవ్వొద్దని ఆయా వార్డులు కౌన్సిలర్లు, ప్రజలు కోరారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతికి 6,7,8 వార్డుల కౌన్సిలర్లు, ప్రజలు శుక్రవారం విన్నవించారు. 6,7,8 వార్డులకు మిషన్ భగీరథ నుంచి తాగునీటిని అందిస్తున్న జూనియర్ కళాశాల వెనక ట్యాంకు నుంచి కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వినతిలో పేర్కొన్నారు. వార్డులకు తాగునీటి సరఫరా చేసే ట్యాంకు ద్వారా వసతి భవనానికి కనెక్షన్ ఇస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపాలిటీలో తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందని వివరించారు. ప్రజల తాగునీటి సరఫరాను దృష్టిలో ఉంచుకొని ప్రసాద్ స్కీం వసతి భవనానికి ప్రత్యామ్నాయ మార్గంలో నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుష్మారావు, సకీనాబీ, సరోజమ్మ, ఆయా వార్డుల ప్రజలు ఉన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు పవిత్రమాలలతో గ్రామ ప్రదక్షిణం, ఆలయంలో ప్రత్యేక పూజలు వేద మంత్రాలతో నిర్వహించారు.

బురదతో అవస్థలు.. స్పందించని అధికారులు



చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు వెళ్లే రోడ్డు దుస్థితి

మానవపాడు: మానవపాడు నుంచి కర్నూల్‌కు అంతర్రాష్ట్ర రహదారి నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడుకు వెళ్లే రహదారిపై రూ.2.50కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పనులు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం మొదలైనప్పటి నుంచి పక్కనే తాత్కాలిక బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. వర్షంవస్తే చాలు తాత్కాలిక వంతెనపై వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, కంట్రాక్టర్లు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, ఏ ఒక్క అధికారి పర్యావేక్షణ చేసిన సందర్భాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు వెళ్లే రోడ్డు నుంచి బీటీని తవ్వి గుంతలకు వేసిన దృశ్యం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండవెల్లి: మండలంలోని ఆర్డీఎస్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. వ్యక్తికి వయసు 45 నుంచి 50 మధ్యలో ఉంటుందని వివరించారు. కాగా శుక్రవారం కెనాల్‌లో మృతదేహం కొట్టుకువచ్చిందన్నారు. ఈ మేరకు తమకు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని బయటకు తీసినట్లు వివరించారు. వ్యక్తి తెల్లటి గడ్డంతో నీలం రంగు లుంగీతో ఉన్నట్లు ఆధారాలను పేర్కొన్నారు. మృతదేహాన్ని అలంపూర్ మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. గుర్తించిన వ్యక్తులు ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?



కేటీదొడ్డి: గిరిజన గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మండలంలోని ఇర్కిచేడులో రోడ్డుపై మురుగు చేరడంతో దోమలకు ఆవాసంగా మారింది. చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలకు దోమల బెడద పెరిగింది. మలేరియా, అతిసారా, డెంగీ, ఇతర వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఉండవెల్లి నుంచి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

బడికి వెళ్లాలంటే ఆటోలే రావాలి..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మారమునగాల, శేరుపల్లి, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు గ్రామాల విద్యార్థులకు బస్సులు లేక, ఆటోలు వచ్చే వరకు ఆగాల్సి వస్తోంది. ఉదయం క్లాసులు వింటే సాయంత్రం ఎలా వెళ్లాలని ఆలోచనలో పడి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు విద్యార్థుల గోస విని బస్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- ప్రశ్నించాల్సిన అధికారి పేరు : మురళీకృష్ణ, డీఎం, గద్వాల్ డిపో.
ఫోన్ నంబర్: 9959226290

ఘనంగా వరలక్ష్మీ వ్రతం



కుచినెర్లలోని వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



గట్టు భవానీ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో, ఇంట్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమపూజతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కేటీదొడ్డి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ చేశారు. పలు ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతం చేయగా, ఇళ్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు

గట్టు: మండల కేంద్రంలోని భవానీ మాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు భవాని మాత ఆలయానికి చేరుకొని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

బంగ్లాదేశ్ ఘటనలపై నిరసన ర్యాలీ



అయిజలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాకాండను ఖండిస్తూ శుక్రవారం అయిజలో బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపారులు మధ్యాహ్నం వరకు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాతబస్టాండ్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్‌లో రోడ్డుపై బైఠాయించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై, ఆలయాలపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న విధ్వాంసకాండను ఆపేందుకు అన్ని దేశాలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన



చాగాపురంలో బాలల సంరక్షణ కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివయ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శివలీల హాజరై మాట్లాడారు. బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం బాలబాలికల కోసం కల్పించిన హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 18 ఏళ్లు నిండకుండా ఆడపిల్లలకు పెళ్లి చేస్తే రెండేళ్ల జైలుశిక్షతో పా టు లక్ష రూపాయల జరిమానా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. గ్రామాల్లో అనాథ పిల్లలు ఉన్నా, అక్రమ రవాణా చేసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం బాలల సంరక్షణ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మి, శోభ, కృష్ణ, సత్యారెడ్డి, కార్యదర్శి రవిగౌడ్, సీసీ కురుమయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, మహిళలు ఉన్నారు.